ప్రభాకర్ ఆత్మహత్య కేసులో 8 మంది రిమాండ్

రఘునాథపాలెం, జూలై 5: చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామ రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య కేసులో ఖానాపురం హవేలీ పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, శుక్రవారం రిమాండుకు తరలించారు. ప్రభాకర్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో మొత్తం 13మందిపై కేసు నమోదు చేశారు. ఐదుగురు పరారీలో ఉన్నారు. అరెస్టయిన వారిలో పెంట్యాల నాగుల్‌మీరా, గుడిపూడి రజినీకాంత్, వేల్పుల కోటయ్య, మొగిలి శ్రీను, షేక్ సిద్దయ్య, వేల్పుల నర్సింహారావు, షేక్ సైదులు, మొగిలి మాధవరావు ఉన్నారు. పెంట్యాల పుల్లయ్య, మొగిలి ముత్తయ్య, గుర్రం నాగమల్లేశ్వరరావు, కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావు.. పరారీలో ఉన్నారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం సమీపంలో ప్రభాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే.

మంత్రులను కలిసిన కేఎంసీ కమిషనర్

ఖమ్మం, జూలై 5: ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌గా ఇటీవల విధుల్లో చేరిన అభిషేక్ అగస్త్య.. శుక్రవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆదర్శ్ సురభి వివాహానికి మేయర్

ఇటీవలి వరకు ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి, వనపర్తి కలెక్టర్‌గా నియమితులైన ఆదర్శ్ సురభి.. శుక్రవారం ఓ ఇంటివారయ్యారు. ఆయన వివాహ వేడుక శుక్రవారం హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలోని స్వగృహంలో జరిగింది. సురభి దంపతులను మేయర్ నీరజ ఆశీర్వదించారు.

మార్క్‌ఫెడ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా కొత్వాల

ఖమ్మం వ్యవసాయం, జూలై 5: మార్క్‌ఫెడ్ ఎక్స్ అఫీషియో డైరెక్టర్‌గా ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన పాలకవర్గ సమావేశం ఎంపిక చేసింది. కొత్వాలను మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఎండీ సిహెచ్.సత్యనారాయణరెడ్డి, పాలకవర్గ సభ్యులు సత్కరించారు.

వరిలో వెదజల్లే పద్ధతి పాటించాలి: ఏడీఏ

రఘునాథపాలెం, జూలై 5: రైతులు వరిలో వెదజల్లే పద్ధతి పాటించాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. రఘునాథపాలెం రైతు వేదికలో రైతులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఏవో ఇంటూరి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఖమ్మం కిమ్స్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఖమ్మం సిటీ, జూలై 5: నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో గురు, శుక్రవారాల్లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ పెద్దిరెడ్డి సుధీంద్రరెడ్డి నిర్వహించారు. మెదడు, వెన్నెముక, నరాల సమస్యలతో బాధపడుతున్న వారికి అతి తక్కువ ధరకే చికిత్స అందించారు.

కేయూ పాలకమండలిలో జిల్లాకు మొండిచేయి

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 5: కాకతీయ యూనివర్సిటీ(కేయూ) పాలకమండలిలో ఖమ్మం జిల్లాకు మొండిచేయి చూపారని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్ అధ్యక్షుడు డాక్టర్ కొల్లు నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజీవ్ రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓ ప్రకటన చేశారు.

కలెక్టర్‌ను కలిసిన పెట్రోలియం డీలర్లు

కలెక్టర్ ముజమ్మిల్‌కు మొక్క అందిస్తున్న డీలర్లు

ఖమ్మం, జూలై 5: ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం నూతన కలెక్టర్ ముజమీల్ ఖాన్‌ను కలెక్టరేట్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈశ్వరప్రగడ రంగనాథ్, కూరపాటి మంజుల, వజినేపల్లి శ్రీనివాస రవికుమార్, నాగబత్తిని రవి, మోతుకూరి గోపాల రావు, సన్నె ఉదయ్ ప్రతాప్, కీమా నాయక్, మాగంటి ప్రసాద్, విప్లవ కుమార్, వేగలం శ్రీనివాస్, మలిశెట్టి వరుణ్, దమ్మాలపాటి నగేష్, మద్ది పిచ్చయ్య, దిలీప్ రెడ్డి, నాగబత్తిని భాస్కర్ రావు పాల్గొన్నారు.

ఏఎస్ఐ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

మామిళ్లగూడెం/ మధిర రూరల్, జూలై 5: మధిర ఏఎస్ఐ జి.వెంకన్న ఇటీవల మృతిచెందారు. ఆయన కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా రూ.8లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తానికి చెక్కును శుక్రవారం పోలీస్ కమిషనరేట్‌లో వెంకన్న కుటుంబానికి కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం అందించారు.

మార్కెట్‌లోకి హీరో ఎలక్ట్రిక్ బైక్

ఎలక్ట్రిక్ బైకును ప్రారంభిస్తున్న షోరూం బాధ్యులు

రఘునాథపాలెం, జూలై 5: హీరో మోటో కార్ప్ సంస్థ మరో సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఖమ్మం మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 'విడ వీ-1' పేరుతో రూపొందించిన ఈ బైక్‌ను శుక్రవారం నగరంలోని శ్రీశ్రీశ్రీ ఆటో మొబైల్స్ హీరో షోరూంలో ఎండీ ఈశ్వర ప్రగడ ఉషారాణి ఆవిష్కరించారు. దీని ప్రత్యేకతలను మరో ఎండీ ఈశ్వరప్రగడ రంగనాథ్ వివరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మండలంలో వైద్య శిబిరాలు

వేంసూరు, జూలై 5: మండలంలోని మర్లపాడు, అమ్మపాలెం, కొత్తూరు, కందుకూరు, కేజీమల్లెల గ్రామాల్లో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో 189 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య అధికారి, పల్లె దవాఖాన వైద్యులు రోగులకు ఆరోగ్య సూచనలు చేశారు.

పెనుబల్లిలో జోరువాన

పెనుబల్లి, జూలై 5: పెనుబల్లి మండలంలో గురువారం అర్ధరాత్రి జోరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు మొదలై కుంభవర్షంలా కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. చిన్నచిన్న కుంటల్లో వర్షపునీరు చేరింది. వరిపొలాలు నీటితో నిండాయి.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

కలెక్టర్‌లా గాక.. కర్షకుడిలా..

- ప్యాంటు పైకి మడిచి.. చెప్పులు పక్కన విడిచి.. నారుమడిలోకి దిగి..
- గడ్డి నేలపై కూర్చొని.. కర్షకుల కష్టాలు తెలుసుకొని..
- తల్లాడలో రైతులతో మమేకమైన ఖమ్మం కలెక్టర్

గడ్డి నేలపై కూర్చొని అన్నదాతల సమస్యలు తెలుసుకున్నంటున్న కలెక్టర్, పొలంలోకి దిగి పంటను పరిశీలిస్తున్న ఖాన్

సత్తుపల్లి (తల్లాడ), జూలై 5: అతడు కలెక్టర్‌లా గట్టుమీద నిలబడి రైతులకు సూచనలు ఇవ్వలేదు. కాలికి మట్టి అంటకూడదనుకొని కారులోంచి దిగకుండానూ ఉండలేదు. ఏకంగా కర్షకుడిలా మారి వారితో మమేకమయ్యారు. అన్నదాతల కష్టసుఖాలను తానూ తెలుసుకున్నారు. అతడు ఎవరో కాదు.. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్. ఖమ్మం జిల్లా తల్లాడ మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. మిట్టపల్లి గ్రామంలో ఆగారు. అక్కడ రైతులు వరి నారు వేసే దగ్గర నుంచి మొదలుకొని పంటను కోసి విక్రయించే వరకూ ప్రతి దశలోనూ వారికి వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు అందించాల్సిన అంశంపై చర్చించేందుకు, రైతుల కష్టనష్టాలు తెలుసుకునేందుకు కారు దిగారు. నేరుగా రైతులు పనులు చేస్తున్న పంట పొలాల వద్దకు వెళ్లారు. ఓ రైతు వెదజల్లే పద్ధతిలో సాగుచేస్తున్న వరి పొలాన్ని గమనించారు. వెంటనే ప్యాంటు పైకి మిడిచి, కాలికి ఉన్న చెప్పులను పక్కన విడిచి.. పొలంలోకి దిగారు. పొలాన్ని ఆసాంతం పరిశీలించారు. ఆ తరువాత రైతులతో కలిసి పొలం గట్టునే గడ్డి నేలపై కూర్చున్నారు. వ్యవసాయ పద్ధతులు, పెట్టుబడులు, దిగుబడులు వంటి అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం, నూతన సాగు పద్ధతుల గురించి రైతులకు వివరించాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చేలా సూచనలు చేయాలని అధికారులకు సూచించారు. కాగా, సాక్షాత్తూ కలెక్టరే కటిక నేలపై తమతో కూర్చొని తమ సాదకబాధకాలను తెలుసుకోవడం పట్ల అన్నదాతలు కూడా ఆనందం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా

సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు, పంచాయతీ కార్మికులు

మామిళ్లగూడెం, జూలై 5: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ముందు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బొజ్జ జీవరత్నం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథిగా సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానిచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ఎన్నికల ముందు దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి'

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమర్లపూడి అప్పారావు, పగిడికత్తుల రామదాస్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలకు పైగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాలను వెళ్లదీయడం ఇబ్బందిగా మారిందన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో ఈ నెల 11న హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఎర్రుపాలెం, జూలై 5: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉషాశారద స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దేవరకొండ శిరీష, శీలం కవిత, రవి పాల్గొన్నారు.

నిర్మాణానికి చెక్కు అందజేత

సత్తుపల్లి టౌన్, జూలై 5: మండలంలోని కిష్టారం గ్రామంలో సింగరేణి అధికారుల నివాస గృహ నిర్మాణ అనుమతి కోసం కిష్టారం గ్రామ పంచాయతీ గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీం ప్రకారం సింగరేణి చెల్లించాల్సిన రూ.41.70 లక్షల చెక్కును కిష్టారం పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో నాగేశ్వరరావుకు శుక్రవారం అందజేశారు. కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ నర్సింహారావు పాల్గొన్నారు.

'మొక్కలతోనే మానవ మనుగడ'

సత్తుపల్లి, జూలై 5: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ రవిబాబు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పట్టణ శివారులోని తామరచెరువు కట్టపై శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ రిటైర్డు ఉద్యోగి మృతి

పెనుబల్లి, జూలై 5: మండలంలోని వీఎం బంజర గ్రామానికి చెందిన రిటైర్డు రెవెన్యూ ఉద్యోగి ఎస్‌కే సిలార్ (63) గుండెపోటుతో మృతిచెందారు. గ్రామానికి చెందిన సిలార్‌కు శుక్రవారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని పెనుబల్లి వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

'వోల్వో ట్రక్ ఆపరేషన్' శిక్షణ

సత్తుపల్లి టౌన్, జూలై 5: సత్తుపల్లి పరిసర గ్రామాల నిరుద్యోగ యువకులకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేషన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాల ప్రభావిత ప్రాంతాల, పరిసర గ్రామాల నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ఈ నెల 10లోపు ఎంవీటీసీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

మధిర, జూలై 5: రైలుకింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మధిర – మోటమర్రి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మధిర – మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య కి.మీ.నెంబర్ 528/26-28 దిగువ మెయిన్‌లైన్ రైలు పట్టాలపై వెళ్లే గూడ్స్ రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని, ఆత్మహత్య చేసుకొని మృతిచెంది ఉంటాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచినట్లు మధిర జీఆర్‌పీ రైల్వేపోలీస్ ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జి ఎస్సై వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712658589, 8712658607 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

గేటు కారేపల్లికి ఏపీ ఎమ్మెల్యే

కారేపల్లి, జూలై 5: ఏపీలోని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మండలంలోని గేటు కారేపల్లికి శుక్రవారం వచ్చారు. ఎన్ఆర్ఐ తోటకూరి దిలీప్‌కుమార్ ఆహ్వానం మేరకు వచ్చిన ఆయనకు.. గ్రామస్తులు స్వాగతం పలికారు.

ఓటమి విజయానికి నాంది కావాలి: కలెక్టర్

గ్రంథాలయంలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 5: ఓటమి విజయానికి నాంది కావాలని, ఓటమికి నిరుత్సాహ పడొద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారి మధ్యన కూర్చుని సమస్యలు, సౌకర్యాలను తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో, ఏయే అంశాలను గమనంలో ఉంచుకోవాలో వివరించారు. గ్రంథాలయ ఆవరణను పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. లైబ్రేరియన్ నాగన్న పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి చేయూతనిస్తాం: కలెక్టర్

మామిళ్లగూడెం, జూలై 5 : దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో దివ్యాంగులు కలెక్టర్‌ను కలిసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వివిధ శాఖల్లో అవకాశాలను బట్టి ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు సస్పెన్షన్

ఖమ్మం సిటీ, జూలై 5: ప్రమోషన్స్ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారన్న అభియోగాలతో మాజీ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం పెద్దాసుపత్రిలో ఆరుగురు ఎంఎల్‌వోలు, రికార్డ్ అసిస్టెంట్స్‌కు జూనియర్ అసిస్టెంట్స్‌గా ఉద్యోగోన్నతిని డీసీహెచ్‌ఎస్ హోదాలో కల్పించారు. ఈ విషయంలో ఆయన రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోలేదు. దీనిపై రాష్ట్ర స్థాయి అధికారులు విచారణకు ఆదేశించారు. ప్రమోషన్స్ విషయంలో అక్రమాలు జరిగాయని తేలడంతో డాక్టర్ వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. ఉన్నతాధికారులు మూడు రోజుల క్రితమే ఆయనను ఖమ్మం డీసీహెచ్‌ఎస్‌గా తప్పించి, డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో వన మహోత్సవం

మొక్కలు నాటుతున్న స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 5: నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం చిన్నారులు వన మహోత్సవం జరుపుకున్నారు. తమ చిట్టి చేతులతో రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటారు. 'మొక్కలు నాటుదాం..పర్యావరణాన్ని కాపాడుదాం' అని నినదిస్తూ, ప్ల కార్డులు చేబూని ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండియన్ టాలెంటెడ్ ఒలింపియాడ్‌లో 'సర్వజ్ఞ' ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 5: ఇండియన్ టాలెంటెడ్ (ఐటీ) ఒలింపియాడ్ రాష్ట్రస్థాయి పోటీల్లో నగరంలోని వీడీవోస్ కాలనీకి చెందిన సర్వజ్ఞ పాఠశాల 5వ తరగతి విద్యార్థి అక్షయ రుత్విక్ సత్తా చాటాడు. హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ టాలెంటెడ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో గణిత శాస్త్ర విభాగంలో ప్రథమ బహుమతి సాధించాడు. ఈ చిన్నారిని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వీకే నాగేంద్రకుమార్, హెచ్‌ఎం టిఅరుణదీప్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి: జడ్పీ సీఈవో

వేంసూరు, జూలై 5: సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జడ్పీ సీఈవో వినోద్ సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడా మురుగునీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నియంత్రణ కోసం గ్రామాల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లాలని, తాగునీటి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని సూచించారు. అధికారులు పగుట్ల వెంకటేశ్వరరావు, ఎంఎ రాజు, రంజిత్‌కుమార్, రామ్మోహన్, జయలక్ష్మి, కరుణశ్రీ, ఇందు ప్రియాంక, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

'డిప్యూటీ సీఎం ఆదేశించినా సమస్య పరిష్కరించట్లేదు'

బోనకల్లు, జూలై 5: రహదారి ఆక్రమణ సమస్యను పరిష్కరించాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆదేశించినా స్థానిక అధికారులు పట్టించుకోవం లేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటమర్రి పంచాయతీలో దారిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని డిప్యూటీ సీఎంకు ఇటీవల తాము విన్నవించామని అన్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం స్వయంగా స్పందించి దారిని పరిశీలించారని, పంచాయతీ రికార్డుల ఆధారంగా ఉన్న దారిని గుర్తించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారని అన్నారు. అయినప్పటికీ స్థానిక అధికారులు ఆ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎంపీడీవో లకావత్ రాజు, ఎంపీవో వీవీ శాస్త్రీలకు వినతిపత్రాన్ని అందజేశారు.

బీఎస్ఎన్ఎల్‌కు 4, 5జీ సేవలను అనుసంధానించాలి

ఖమ్మం సిటీ, జూలై 5: బీఎస్ఎన్ఎల్‌కు 4జీ, 5జీ సేవలను అనుసంధానించాలని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీవీ నాగేశ్వరరావు, వి.సునీల్ డిమాండ్ చేశారు. వారు శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గత ఎనిమిదేళ్లుగా బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని విమర్శించారు.

నేడు బాస్కెట్‌బాల్ ఎంపికలు

ఖమ్మం సిటీ, జూలై 5: బాస్కెట్‌బాల్ అండర్-16 (బాలురు-బాలికలు) సెలక్షన్స్ ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఉంటాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జె.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలిచిన వారు తమ పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ (క్రీడాకారుడిది, తండ్రిది) జిరాక్స్ కాపీలతో వచ్చి పేర్లు నమోదు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన జట్టును ఈ నెల 10, 11 తేదీల్లో మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే అంతర్ జిల్లా చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7386698298, 7306768818 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

మధిర రూరల్, జూలై 5: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. కొంతమంది అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరయ్యారు. పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. మాటూరుపేట పీహెచ్‌సీ పరిధిలో రెండు డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి టౌన్, జూలై 5: సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మహేశ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సాధారణ సమావేశం సాదాసీదాగా ముగిసింది. వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టేందుకు, నీటి సరఫరా, విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు సభ్యులు సూచనలు చేశారు.

విద్యుత్ వైర్లు తగిలి బాలుడికి తీవ్రగాయాలు

ఖమ్మం రూరల్, జూలై 5: మండలంలోని సాయిగణేష్‌నగర్ కాలనీలో 33 కేవీ హైటెన్షన్ వైర్లు తగిలి శుక్రవారం ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. సాయిగణేశ్‌నగర్ కాలనీ రోడ్-14లో మధురెడ్డి దంపతులు నివాసం ఉంటున్నారు. ఇంటిపైకి వచ్చిన కోతులను వెళ్లగొట్టేందుకు మధురెడ్డి కుమారుడు భరత్ శుక్రవారం డాబాపైకి వెళ్లాడు. కోతులను వెళ్ల గొట్టే క్రమంలో ఇతడు పట్టుకున్న ఇళ్లు శుభ్రం చేసే ఇనుక రాడ్డు కరెంటు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతడికి 70 శాతం గాయాలు కావడంతోఖమ్మంలోని ఓ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు.

ఇందిరమ్మ డెయిరీ సరిహద్దుల్లో మొక్కలు నాటాలి

బోనకల్లు, జూలై 5: ప్రభుత్వం ఇందిరమ్మ డెయిరీ నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించడంతో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్థలాల సరిహద్దును అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ అధికారులను వెంటనే ఆ ప్రాంతంలో పలు రకాల మొక్కలను మూడు వరుసల్లో నాటాలని ఆదేశించారు. తహసీల్దార్ చందర్, ఎంపీడీవో రాజు, ఏపీవో కృష్ణకుమారి, ఆర్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలి'

మధిర, జూలై 5: మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, ఇన్‌చార్జి కమిషనర్ సీహెచ్ వేణు సూచించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై స్థానిక కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, మెప్మా సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఐటీ హబ్ ఏర్పాటుకు భవనాల పరిశీలన

మధిర, జూలై 5: మధిరలో ఐటీ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఇటీవల ప్రకటించారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని తాత్కాలికంగా ఏర్పాటు కోసం శుక్రవారం భవనాల పరిశీలన కార్యక్రమాన్ని తహసీల్దార్ జీ.వెంకటేశ్వర్లు చేపట్టారు. పట్టణంలోని నాలుగు చోట్ల బిల్డింగ్‌లను పరిశీలించామని, వీటిలో ఐటీ హబ్‌కు ఉపయోగపడే భవనాల నివేదికను ప్రభుత్వానికి పంపుతామని తహసీల్దార్ తెలిపారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

కూసుమంచి, జూలై 5: వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ సురేశ్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ కిషోర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'పత్తిలో కలుపు నివారణ చర్యలు తీసుకోండి'

కూసుమంచి, జూలై 5: పత్తిపంట వేసిన రైతులు కలుపు నివారణ చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పంటకు నష్టం కలుగుతుందని ఏవో రామడుగు వాణి తెలిపారు. గట్టుసింగారంలో శుక్రవారం పత్తి, పచ్చిరొట్ట వేసిన రైతుల పొలాలను పరిశీలించి సూచనలు చేశారు. ఏఈవో జయరాం పాల్గొన్నారు.

విద్యతో అన్నీ సాధ్యమే: డాక్టర్ శ్రీధర్

కూసుమంచి, జూలై 5: 'విద్యతో దేనినైనా సాధించవచ్చు. అది మనిషిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది' అని పాలేరు జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. మండలంలోని జక్కేపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ అరుణ, డిప్యూటీ రిజిస్ట్రార్ బాలాజీ నోట్ పుస్తకాలను అందజేసి మాట్లాడారు.

'ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి'

ముదిగొండ, జూలై 5: సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలందరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల అధికారులతో ముదిగొండలో శుక్రవారం నిర్వహించిన సమావేశం వారు మాట్లాడారు. వైద్యాధికారి అరుణాదేవి, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జడ్పీటీసీ దుర్గ, ఎంపీడీవో స్వామి, ఎంపీవో సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైతులు పచ్చి ఎరువులు వేసుకోవాలి: ఏవో

కొణిజర్ల, జూలై 5: పంట చేను మంచిగా ఉండాలంటే రైతులు పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని ఏవో బాలాజీ సూచించారు. మండలంలోని కొణిజర్ల, గోపవరం, గోపతి గ్రామాల్లో రైతులు వేసిన పచ్చిరొట్ట, జనుము, జీలుగు పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

రైతు పొలంలోని విద్యుత్ మోటారు చోరీ

కొణిజర్ల, జూలై 5: మండలంలోని పల్లిపాడులో పది రోజులుగా వరుసగా ముగ్గురు రైతుల పొలాల్లో మూడు విద్యుత్ మోటార్లను చోరీకి గురయ్యాయి. అదే గ్రామానికి చెందిన షేక్ దర్గావలి అనే రైతు పొలంలో ఉన్న బోరు మోటార్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు సదరు రైతు దర్గావలి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కలెక్టర్‌ను కలిసిన వైరా మున్సిపల్ చైర్మన్

వైరాటౌన్, జులై 5: కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజమ్మిల్ ఖాన్‌ను వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ శుక్రవారం ఖమ్మం ఐడీవోసీలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'రైతు ఆత్మహత్యాయత్నం కారకులను శిక్షించాలి'

కారేపల్లి, జూలై 5: రైతు ఆత్మహత్యయత్నానికి కారకులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు వీరభద్రం, నాగేశ్వరరావు, నరేంద్ర, బాన్సిలాల్ డిమాండ్ చేశారు. కారేపల్లిలోని తమ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉసిరికాయలపల్లి రైతు భద్రయ్య వ్యవసాయ భూమిని కొందరు ఆక్రమించడం వల్ల అతడు ఆత్మహత్యకు ప్రయత్నించాడని అన్నారు. అందుకు కారకులను అరెస్టు చేయాలని కోరారు.

అన్నం సేవాశ్రమంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎస్సై సూరజ్ దంపతులు

రఘునాథపాలెం, జూలై 5: ఖమ్మం టూటౌన్ ఎస్సైగా సూరజ్ తన జన్మదినం సందర్భంగా అన్నం సేవా ఫౌండేషన్‌లోని మానసిక వికలాంగులకు శుక్రవారం అన్నదానం చేశారు. అభాగ్యులను చేరదీసి సేవలందిస్తున్న ఫౌండర్ అన్నం శ్రీనివాసరావును ఎస్సై అభినందించారు. ఎస్సై సతీమణి ప్రవళిక, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.